# 17. రతి రహస్యం

విసుగు నెరుగని విక్రమార్కుడు మర్రిచెట్టెక్కి, శవాన్ని భుజాన వేసుకొని, మెల్లిగా నడక సాగించాడు.

శవాన్ని ఆవహించిన వీర్యభేతాళుడు అన్నాడు:

“రాజా! ఏమి ఆశించి యీ దుష్కర కార్యభారాన్ని నెత్తికెత్తుకున్నావో కాని, పర్యవసానాన్ని గూర్చి ముందుగానే అన్నివిధాలా ఆలోచించి ఉండవనే నేను అనుకుంటున్నాను. తానొకటి తలుస్తే దైవమొకటి తలుస్తా డనేది కేవలం సామ్యం మాత్రమే కాదు. అనేక సందర్భాలలో సరిపడే సత్యం. ఎంత తెలివిగా ఆలోచించినా, పరిస్థితులన్నీ ఎంత అనుకూలంగా ఉన్నా, విజయం బారెడు దూరంలో ఉన్నదనే సూచనలు ఎంత బలవత్తరంగా ఉన్నా– ఒక్క క్షణంలో అంతా తారుమారై ఆశించిన దానికి సరిగ్గా విరుద్ధ పరిణామాలు సంభవం కావొచ్చు. .... నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకుగాను – విద్యాధికురాలైన చంచలను గూర్చిన గాథను చెపుతాను – విను:”

వీర్యభేతాళుడు చెప్పిన కథ ఇది:

పరిసరాల్లో ఉన్న మూడుగ్రామాలకూ కలిసి రామాపురంలో ఒక ఆడపిల్లల హైస్కూలూ, అదేవిధంగా ఒక పోలీసు స్టేషనూ, సమితి తాలూకు ఒక ఆసుపత్రీ ఉన్నవి. స్త్రీలకంటూ ప్రత్యేకంగా ఆసుపత్రయితే లేదు; కాని, ఆ ఉన్న దాంట్లోనే పురుళ్ళు పోసేందుకూ, ఆడ రోగుల్ని ప్రత్యేకంగా ఉంచేందుకూ వసతులున్నవి. ప్రత్యేకించి ఒక లేడీడాక్టర్ కూడా నియోగించబడింది.

గరల్స్ హైస్కూల్లో గత పంచవర్ష ప్రణాళికలో ప్రవేశించిన ప్రధానోపాధ్యాయిని ముసలి వసుంధర రిటైరవుతుండగా, నవయవ్వనీ, అందాల బరిణె అనదగిన చంచల ఆ స్థానానికి కేటాయించబడింది. ఊళ్ళోని యువకబృందమూ, ముఖ్యంగా సమితి సభ్యులూ, అంతకన్నా ముఖ్యంగా సమితి ప్రెసిడెంట్ ఐన చంద్రారెడ్డీ, రిటైరైపోతూన్న వసుంధరమ్మకు – ఆమె వొదిలిపోతున్నందుకు హృదయపూర్వకంగా వీడ్కో లిచ్చారు; నవయవ్వని ఐన చంచలకు ఘనస్వాగతాలిచ్చారు.

ముసిముసి నవ్వులు చిలకరించుకుంటూ హెడ్‌మిస్ట్రెస్ స్థానాన్ని కరతాళధ్వనుల సందడిలో చంచల చల్లగా ఆక్రమించింది. చంచలను చూసిన క్షణం నుంచే ఆ ఊరిలోని యువక హృదయాలే గాక, ముసలి హృదయాలు కూడా స్పందనాలను అత్యధికం చేసుకున్నవి. ఐతే యీ చంచల అందని పండనీ, అధవా అందినా అధికారులకూ, సూటిగా తమ పలుకుబడులను ప్రయోగించగల సమితి సభ్యులకూ – వీరిలో కూడా అతి ముఖ్యుడూ, అందర్నీ ఒక తాటిమీద నడిపించగల శక్తి సామర్థ్యాలూ, నక్కజిత్తులూ, రాజకీయ దక్షతా వున్న శృంగార పురుషుడు చంద్రారెడ్డి ఉండగా, మిగతావారు దూరాన ఉండితీరక తప్పదనీ ఆబాలగోపాలానికీ సుస్పష్టంగా తెలిసిన విషయమే!

చంద్రారెడ్డి పలుకుబడి దశదిశలా ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తూ సూర్యకాంతివలె తోస్తూనే ఉన్నది. ఇంత స్వల్ప విషయం గ్రహించలేకపోలేదు చంచల. అందునా చంద్రారెడ్డి గొడ్ల సావిడికి ఆనుకొని ఉన్న అతని ఇంటిలోనే ఒక భాగాన్ని ప్రత్యేకించి చంచలకు నివాసంగా ఉచితంగా ఇవ్వటంతో– విద్యాభివృద్ధికిగాను చంద్రారెడ్డి ఇచ్చిన ప్రోత్సాహమూ, దాతృత్వమూ నలుగురూ చెప్పుకోదగిందిగా రూపొందింది. లోగుట్టు విషయం కూడా అందరికీ తెలిసిందే ఐనా పైకి అనే సాహసం ఎవరికీ లేదు.

సభ్యతా ప్రపంచంలో ఆక్రమించిన స్థానాన్ని అనుసరించి చంచల – 'కుమారి చంచల'గా వ్యవహరించబడినా, ఐదారుమంది విలాస పురుషులకు లోగడే ఆమె తన 'కుమారిత్వాన్ని' సమర్పించిన రహస్యం అందరికీ కాకున్నా కొంతమందికి– ముఖ్యంగా ఆమెకు బాగా తెలుసు. మొదట్లో వరసాగ్గా ఇద్దరు ప్రియులచేత మోసగించబడి, బహిరంగంగా తన కన్నెచెర విడిపించుకోవాలని ప్రయత్నించిందామె. ఐతే ఆ ప్రియులు ఆమెకు అనుభవాన్నిచ్చి, కన్యాత్వపు బరువును శాశ్వతంగా ఉపసంహరించే అవకాశాన్ని మాత్రం ఇవ్వలేదు.

మొదటి రెండు అనుభవాలతోనూ బొప్పెకట్టగా, ఇక పురుషు లెవర్నీ నమ్మరాదనీ, తనకు అవసరమైనంత వరకే వాళ్ళను ఉపయోగించుకోవాలనే సిద్ధాంతాన్ని చంచల గాఢంగా నమ్మి అమలు జరుపసాగింది. యీ విధంగా చంచల సార్థక నామధేయ ఐంది.

రామాపురంలోని వ్యవహారాలను ఆమె వెంటనే ఆకళింపు చేసుకున్నది. చంద్రారెడ్డి పలుకుబడిని ఆమె గ్రహించింది. కాలుజారినా ఫర్వాలేదనుకునే పడతి చంద్రారెడ్డి లాటి మధ్యవయస్కుణ్నీ, రసికుణ్నీ నిరోధించగలగటం అంత తేలికేం కాదు. అందునా అనుభవంతోపాటు ధనసంపాదనా, నాలుగు కాలాలపాటు ఈ ఉద్యోగంలో అధికారాన్ని చలాయిస్తూ హాయిగా ఉండాలనే వాంఛా, రెడ్డిగారి రక్షణలో ఉండగా తనకేమీ భయం లేదనే నమ్మకం మొదలైన అనేక కారణాలు చంద్రారెడ్డిని ఎక్కువ శ్రమ పెట్టకుండానే ఆమెను లొంగదీసినవి.

చంచల యీ గ్రామం ప్రవేశించిన సమయంలోనే అక్కడి పోలీస్‌స్టేషన్‌కు - వీరారెడ్డి అనే సబ్ ఇనస్పెక్టర్ కూడా కొత్తగా వొచ్చాడు. ఈ వీరారెడ్డి, చంద్రారెడ్డికి సహాధ్యాయి కావటంవల్ల వారిద్దరి స్నేహమూ ఇప్పుడు మరింత గాఢమయే అవకాశాలు ఏర్పడినవి.

వీరారెడ్డి వంశపారంపర్యా ఐశ్వర్యవంతుడు; ఈ ఉద్యోగం కూడా సరదాకూ, తాహతుకూ చేస్తున్నాడే కాని జీవనోపాధికి కాదు. అతను నిప్పులాటి మనిషి, చాలా స్ట్రిక్ట్ ఆఫీసర్. లంచాలకూ, స్నేహాలకూ, పలుకుబడులకూ ఏమాత్రం సందిచ్చే రకం కాదు. నిజానికి పట్టణంలో ఉద్యోగం చేస్తూ ఎంత గొప్ప రాజకీయవాది అన్యాయంగా ఏం చెప్పినా లొంగని కారణాన, అతన్ని మరేమీ చేయలేక, యీ గ్రామానికి బదిలీ చేయించటం జరిగింది.

వీరారెడ్డి ఛార్జి తీసుకోగానే స్టేషన్ వ్యవహారా లన్నిటినీ ఒక క్రమానికి లాక్కొచ్చాడు. ఏకైక జాతీయ పరిశ్రమగా దినదినాభివృద్ధి అవుతూన్న సారా బట్టీలను మట్టుబెట్టాడు. సన్నకారు పోలీసులకు అందే మామూళ్ళన్నీ మటుమాయమైనవి. 'లా అండ్ ఆర్డర్'ను సుస్థాపితం చేసేందుకు బద్ధకంకణుడైన వీరారెడ్డి అధికారాన్ని యోగ్యులు పొగిడారు; అయోగ్యులు తెగిడారు. ఏది ఏమైనా అతనంటే చెడుపనులు చేయదలుచుకున్న వారికి సింహస్వప్నమైంది.

వీరారెడ్డి చంద్రారెడ్డిని తరచుగా కలుసుకుంటూనే ఉండేవాడు. అనేకసార్లు మిత్రుడు భోజనానికి పిలవగా వీరారెడ్డి వెళ్ళాడు. వీరి స్నేహం చూసి, పోలీసులు తమకు కాస్త అనుకూలంగా ఉండే విధంగా చంద్రారెడ్డి ద్వారా చెప్పిద్దామని కొంతమంది పెద్దమనుషులు(!) ప్రయత్నాలు చేశారు కాని, వీరారెడ్డి తత్వాన్ని బాగా అర్థం చేసుకున్న చంద్రారెడ్డి తన అసహాయతను వెల్లడించక తప్పలేదు.

వీరారెడ్డి ముక్కుకు సూటిగా వెళ్ళే మనిషి. మానవులు కాదు కదా- హరిహరాదులుకూడా అతనికి చెప్పలేరు. న్యాయమంటే చెవి కోసుకునే మనిషి అతను. అధికారిని బట్టే మిగతా పోలీసు ఉద్యోగులు కూడా వొళ్ళు దగ్గరుంచుకొని ప్రవర్తించసాగారు. ఇదంతా ఆరంభశూరత్వం అని పొరబడిన నేరగాండ్రు, తమ

కిక్కడ స్థానం లేదని నిర్ణయించుకొని తమతమ నెలవులు తప్పి, త్వరలోనే చెల్లాచెదరై పొయ్యారు.

ఆరు నెలలు తిరిగేప్పటికి ఆ మూడు గ్రామాలలోని నేరాల సంఖ్య చాలాభాగం తగ్గిపోయింది. వీరారెడ్డి కొరకరాని కొయ్య అనీ, అతన్ని లొంగదీసుకోవటం అసంభవమనే విషయం ప్రజలందరికీ అర్థమైంది.

ఎంత పోలీస్ ఆఫీసరైనా వీరారెడ్డి కూడా మానవమాత్రుడే కదా! అందుకని చంద్రారెడ్డితోడి స్నేహం మాత్రం నిరాటంకంగా దిన దినాభివృద్ధి ఐంది. ఉద్యోగరీత్యా చంద్రారెడ్డికి ఎలాటి సహాయమూ అక్రమంగా చేయవలసిన పరిస్థితి ఏర్పడనంతవరకు యీ మిత్రత్వానికి అఘాతం ఏర్పడదు. ఈ విషయం చంద్రారెడ్డి క్కూడా తెలిసిందే కనుక అతను కూడా జాగ్రత్త వహించాడు.

ఇలా ఉండగా చంద్రారెడ్డి చంచలతో స్నేహాన్ని బాగా తగ్గించాడు. ఇదివరకంత మోజు కనబరచటంలేదు. ఆమెను చూడటమే లేదు. అదీ హఠాత్పరిణామంగా తోచటంవల్ల చంచలకు మొదట్లో అర్థం కాలేదు.

ఎంత తీవ్రంగా చంద్రారెడ్డిని ఆకర్షించాలని చంచల ప్రయత్నించినా సఫలీకృత కాలేకపోతోంది. ఆయన దర్శనమే కరువైంది. ఎప్పుడన్నా దారితప్పి వొస్తే, ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఇబ్బంది పడతాడు. అసలు కారణం తెలుసుకోవాలని ఆమె అనేక ప్రయత్నాలు చేసింది.

ఈ సందర్భంలో లోలోపల చంద్రారెడ్డి మీద మంటగా ఉన్నవారి సహాయాన్ని ఆమె ఆశించింది. విరోధముంటే– ఆ విరోధులు ప్రతిపక్షీయుని ప్రతి కదలికనూ ఎంతో జాగర్తగా పరిశీలిస్తుంటారు కనుక, ఆ రహస్యాలు వారికి తేలిగ్గా తెలుస్తవి.

ఆమె అంచనాలు తప్పలేదు. చంద్రారెడ్డి మనసులోనే కక్ష పెంచుకున్న వారిలో చౌదరి మొదటివాడు. ఏనాటికైనా ఎదిరించి నిలవగల స్తోమతుగలవాడు అతనే! బహిరంగంగా కాకపోయినా, రహస్యంగానైనా చంద్రారెడ్డి పతనాన్ని ఆశించిన వారిలో ముఖ్యుడు యీ చౌదరి.

ఆ చౌదరి తనంతట తానే చంచల దగ్గరకు వొచ్చాడు. హైస్కూలు మేనేజ్‌మెంట్ మెంబర్‌గా అతన్ని ఎవ్వరూ అనుమానించరు. అసలు సంగతి చౌదరే చెప్పేశాడు. ఇటీవల కొత్తగా వొచ్చిన హిస్టరీ అసిస్టెంట్ అరుంధతితో చంద్రారెడ్డికి సంబంధం ఉన్నదనే విషయం వినగానే చంచల కంపించింది.

తనకన్న అందమైన దాని వలలో యీ చంద్రారెడ్డి పడ్డాడంటే తగిన కారణ మున్నదని అనుకోవచ్చు; కాని అరుంధతి ఏ విషయంలోనైనా సరే తనకన్న తీసికట్టేనని స్పష్టంగా తెలిసినప్పుడు సహజంగా చంచల ఈర్ష్యాళువు ఐంది. తన భావాలు పైకి

తెలియకుండా ఆమె జాగ్రత్తపడింది. ఐతే ఎంత ప్రయత్నించినా వాడిపోయిన ఆమె ముఖం చూస్తే, ఆ దుర్వార్త తాలూకు షాక్ తెలుస్తూనే ఉన్నది.

చంద్రారెడ్డిని కలుసుకోగానే చంచల నోటి కొచ్చినదంతా వాగింది; అతన్ని నేరస్థుడుగా చేసి దులిపేసింది. అతడు కాదనలేదు సరికదా "నా ఇష్టం! నువ్వెవరు అడిగేందుకు?" అని ఎదుర్కొన్నాడు. దాంతో ఆమె నోటికి తాళం పడింది.

పరిస్థితులు చాలాదూరం వెళ్ళినవి. వాగ్వాదంలో కానీ ఇతరత్రా కానీ తాను చంద్రారెడ్డిని సాధించటం అసంభవమని ఆమె తేల్చుకుంది. చంద్రారెడ్డి అభిమానించే ఆ అరుంధతి- తన ప్రియుణ్ణి తన్నుకొని వెళ్ళిన గద్దమీద - ఆమె ప్రతీకారం తీసుకోవాలనుకున్నది.

ఐనదానికీ, కానిదానికీ చంచల అరుంధతిని సాధించటం మొదలుపెట్టింది. సమయం దొరుకుతే నానాదుర్భాష లాడింది. దుమ్మెత్తిపోసింది.

చంచల అధికారిణి కావటంవల్ల అరుంధతి ఏమీ చేయలేక- చంద్రారెడ్డితో మొరపెట్టుకుంది.

"నీ ఉద్యోగ మేదో చేసుకుంటూ పడి ఉండు. అనవసరంగా అరుంధతి జోలికి వెళ్ళావో చర్మం వొలిపిస్తాను. యీసారి అరుంధతి నీ మీద కంప్లెయింట్ చేసిందో- నిన్ను వెంటనే బదిలీ చేయిస్తాను. వొళ్ళు దగ్గరుంచుకో!" అని నిష్ఠూరాలాడి వెళ్ళాడు చంద్రారెడ్డి.

తన ప్రియుడు ఎంత మారిపొయ్యాడు! పురుషులు చంచల స్వభావులు! ఇంతక్నన దురన్యాయం ఉంటుందా? ఆ అరుంధతి ఏం మందు పెట్టిందో! అరుంధతిని తానెలాగూ సాధించలేదు. యీ చంద్రారెడ్డిని మాత్రం తా నేం చేయగలదు? ఓటమితో దహించుకుపోతూ, అవమానించబడుతూ, దుఃఖిస్తూ యీ ఊళ్ళో ఉండటం దేనికీ? చంద్రారెడ్డి పలుకుబడితో తన చర్మం వొలవబడినా ఆశ్చర్యం లేదు కాని- బాధ ఉండదా? ఏవిధంగానైనా చంద్రారెడ్డి మీద ప్రతీకారం సాధిస్తే, శాంతించిన మానసంతో తాను ఇంకో గూటికి ఎగిరిపోవచ్చు. అందుకు ఎలాటి మార్గాలైనా ఉన్నవా?

ఈ సమయంలో ఆపద్బాంధవుడల్లే చౌదరి ఊడిపడ్డాడు. ఆమె చెప్పకుండానే అతను అంతా తెలుసుకున్నాడు. పదునెక్కి సిద్ధంగా ఉన్న ఆయుధాన్ని ప్రయోగించేందుకు సరైన సమయమని నిర్ణయించుకున్నాడు.

చంచలపట్ల ఎంతో సానుభూతి చూపాడు. "చంద్రారెడ్డిలాటి చీడ పురుగుల్ని నాశనం చేయవలసిందే!" అన్నాడు. అందుకు తన అండదండలు ఉన్న వన్నాడు. మతి చలించిన విధంగా ఉన్న చంచల మనస్తత్వంమీద చౌదరి అభిప్రాయాలు కాళీయ తాండవం చేశాయి.

తాను తయారుచేసిన పథకాన్ని ఆమె చెవుల్లో ఊదాడు. ఆమె అనుమానాలన్నీ పటాపంచలైనవి. ఇంత తేలిగ్గా మార్గం చేజిక్కుతుందని ఆమె ఎన్నడూ తలపోయలేదు. సంతోషం ముంచెత్తగా చౌదరిని కావిలించుకున్న దామె.

"ముందీ పీడ వొదిలించు!" అని చౌదరి హెచ్చరించి ఆమె బాహు బంధంలోంచి విడివడి, నిష్క్రమించాడు.

## 2

ఉదయం ఆరింటికే డ్రిల్ ఉన్న కారణాన వీరారెడ్డి ఐదున్నరకే స్టేషన్‌కు వొచ్చేశాడు. అతని రాకకోసమే చంచల స్టూలు మీద కూర్చొని ఉన్నది.

ఆమె ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. మొహమంతా పీక్కుపోయి, కళ్లు ఎర్రబారినవి. మనిషెంతో నలిగి పోయినట్లుంది. మనోవ్యధతో మెలికలు తిరుగతూన్నట్లు చూడగానే అర్థమౌతోంది. జుట్టంతా చిందరవందరగా ఉన్నది.

వీరారెడ్డిని చూడగానే అతికష్టం మీద లేచి నిలబడి నమస్కరించింది చంచల.

"ఏమండీ! ఏమైందీ?" అన్నాడు వీరారెడ్డి సానుభూతి ధ్వనించే కంఠ్వసరంతో.

"మీలాటి నిప్పులాటి ఆఫీసర్లుండగానే ఒక విద్యాధికురాలికి మానభంగ మైంది!" అన్నదామె దుఃఖతరంగాలు గంతులు వేసే గొంతుకతో.

"ఎవరూ?"

"చంద్రారెడ్డిగారు!"

వీరారెడ్డి ఒక్క క్షణం నిర్ఘాంతపొయ్యాడు. చంద్రారెడ్డికి యీామెతో సంబంధం ఉన్నదని అతనికి తెలుసు. తనను మానభంగం చేశాడా చంద్రారెడ్డి అని యీామె-బాధ్యతగల ప్రధానోపాధ్యాయిని అంటోంది. తనేం చేయాలి?

"సరే... ఏం జరిగిందో వివరంగా కంప్లెయింట్ రాసివ్వండి" అన్నాడు వీరారెడ్డి పాడ్‌మీద క్లిప్ పెట్టిన కాగితాలు అందిస్తూ.

ఆమెఆపసోపాలు పడుతూ కంప్లెయింట్ రాసింది:

"తెల్లవారు జామున మూడున్నరకు ఎవరో తలుపు కొట్టగా నిద్ర మెలకువ వచ్చింది. 'ఎవర'ని అడిగాను. 'నేను' అన్న జవాబు తాలూకు కంఠస్వరాన్ని బట్టి చంద్రారెడ్డిగారని గ్రహించాను.

ఈ సమయంలో ఆయన ఎందుకొచ్చి ఉంటారనే సందేహం వొచ్చింది. ఐతే ఏదో అత్యవసరమై పనిబడి వొచ్చి ఉంటారనీ, ఆయనలాటి పెద్దమనిషిని బైట నిలవేయటం మర్యాద కాదనీ తలచి తలుపు తెరిచాను.

ఆయన లోపలికి వొచ్చి తలుపు గడియ వేశారు. నా కేమీ అర్థం కాలేదు. నా చెయ్యి పట్టుకున్నారు. వెకిలి నవ్వొకటి నవ్వారు. బ్రాందీ వాసన వొచ్చింది.

ఆయన పవిత్రోద్దేశం నాకు అర్థమైంది. తాగిన మైకంలో ఉన్నారని భ్రమపడ్డాను. మృదువుగా మందలించాను.

ఆయన నిర్లక్ష్యం చేశారు. మెడ మీది నుంచి చేయి వేసి వక్షోజాల్ని వొడిసి పట్టుకున్నారు. నేను విదిలించుకోవాలని గుంజుకున్నాను. రెండో చేత్తో నా నడుం వాటేసుకొని బరబరా మంచం దగ్గరికి లాక్కు వెళ్ళారు.

ఇక లాభం లేదని నిరోధించసాగాను. నేను ఎంత బలంగా ప్రయత్నించినా, ఆయనపట్టు నా మీద అంతకన్న బలవత్తరమైంది. రక్కి, పీకి, పాకం పెట్టాలని ప్రయత్నించాను; కాని ఆ ఏనుగుబలం. దానికితోడు కామ పిశాచి ఆవేశం ముందు నా మానవ ప్రయత్నం వృథా ఐంది.

నన్ను మంచం మీదికి తోశారు. భారతస్త్రీకి పరమ పవిత్రమైన నా శీలం అపహరించ బడుతోందనే ఊహ రాగానే నిలువునా కంపించాను. ఈ మదపిచ్చును నే నొక్కతెనూ ఎదుర్కోలేనని తెలుసుకున్నాను. నా అసహాయ స్థితినుంచి విడుదలయేందుకు మరో సహాయం అవసరం.

అందుకని గొంతెత్తి పెద్దగా అరిచాను. మళ్ళీ అరవకుండా చేసేందుకు గాను పక్కమీది దుప్పటిని ఆయన నా నోట్లో కుక్కారు. ఊపిరాడన ట్లయింది.

తరువాత ఆయన నా చీరె లాగేశారు. ఆ తరువాత నన్ను ఆక్రమించారు. నేను ఎంత ప్రయత్నించీ లాభం లేకపోయింది. బలాత్కారంగా నన్ను నానా క్షోభపెట్టి ఎంతో బాధించి రాబందులు విందు చేసుకున్న విధంగా నా శరీరాన్ని అపవిత్రం చేసి, తలుపులు తెరుచుకొని బైటికి వెళ్ళారు.

నీరసించిపోయిన యీ శరీరాన్ని ఎలాగో నానా అవస్థపడి పోలీస్ స్టేషన్‌కు లాక్కొచ్చి స్వయంగా తమకు ఫిర్యాదు చేసుకుంటున్నాను."

అంతా రాసి కింద సంతకం చేసి ఆ కాగితాన్ని వీరారెడ్డికి అందించింది చంచల.

వీరారెడ్డి జాగర్తగా పరిశీలించాడు.

"సరిగ్గా నాలుగింటికేనా?"

"ఔనండి... మంచం కాళ్ళకట్టవైపున్న బిగ్‌బెన్ నాలుగు చూపుతోంది!"

వీరారెడ్డి ఇంకా ప్రశ్నలు అడగా లనుకున్నాడు; కాని ఇది సమయం కాదని నిశ్చయించుకున్నాడు.

వెంటనే లేడీ డాక్టరుకు యీమెను పరీక్షించి రిపోర్ట్ పంపవలసిందిగా మెమో రాశాడు.

"సమితి ఆస్పత్రిదాకా నడవగలరా?" అన్నాడు వీరారెడ్డి.

ఆమె తల వూపింది.

"త్రీ ట్వెంటీ!" అని వీరారెడ్డి కేకవేయగానే అబ్దుల్‌రహీం ఎదురుగా వొచ్చి సెల్యూట్ చేశాడు.

"ఈమెను సమితి ఆస్పత్రికి తీసుకొని వెళ్ళి లేడీ డాక్టర్ చేత పరీక్ష చేయించి రిపోర్టు తీసుకొనిరా–" అని మెమో అందించి వీరారెడ్డి డ్రిల్‌కి వెళ్ళిపొయ్యాడు.

రహీమ్ ముందూ, అతన్ని అనుసరించి చంచలా నడక సాగించారు.

చంచల పోలీస్ స్టేషన్‌కు వొచ్చినప్పటినుంచీ ఇప్పటిదాకా జరిగిందంతా రహీం గమనిస్తూనే ఉన్నాడు.

సమితి ఆస్పత్రి మైలుదూరముంది; మధ్యలో అన్నీ జొన్న చేలు. నడుస్తూ నడుస్తూ రహీమ్ మాటలు సాగించాడు.

"ఎప్పుడో నాలుగింటికి రేప్ జరిగిందన్నారు. ఇప్పుడు ఆరు దాటుతోంది. తీరా లేడీ డాక్టర్ పరీక్ష చేస్తే...?" అన్నాడతను.

అదీ నిజమే! లోపలి సరుకులో మార్పుతేవటం కన్నా పై లేబిల్‌ను మార్చటం తేలిక! ఐతే లేబిల్‌ని చూసి మోసపోని వాళ్ళ మాటేమిటి?

"మరెట్లా?" అన్నది చంచల.

"మీరేమీ అనుకోకపోతే–"

"చెప్పు–"

"ఇదంతా నిజంగా రేప్‌వలె ఉండేట్లు చేయాలి. మీకు అభ్యంతరం లేకపోతే నేను సహాయం చేస్తాను!" అన్నాడు రహీమ్.

రహీమ్ లాటి వాళ్ళు ఎరికల, ఏనాది, హరిజన, గిరిజన స్త్రీల పొందుకు మాత్రమే అర్హులు. చంచలలాటి విద్యాధిక, నవయవ్వన సౌందర్యవతి తోడి సంయోగం రహీమ్ తెగ మనుషులకు కలలో కూడా లభ్యమవదు. ఇలాటి సదవకాశం చేజిక్కుతుందనే ఆశయితే రహీమ్‌కు లేదు కాని, ఒక్క చిట్కా తగిలించి చూస్తే పొయ్యే దేమిటని యీ ఎత్తు వేశాడు.

చంచల ఒక్కక్షణం ఆలోచించింది. అసలిది ఇంతదూరం వొస్తుందనీ, శల్యపరీక్ష జరుగుతుందనీ ముందుగా ఆమె ఆలోచించలేదు. ఒక అబద్ధాన్ని నిజం చేసేందుకు పడవలసిన పాట్లు ఎంతెంతవారికీ తప్పవు. అందులోనూ ఉద్రేకాలతోనూ, ఉద్వేగాలతోనూ తలక్కిందులైపోతూన్న తనకు తట్టని ఆలోచన యీ రహీమ్‌కు తట్టింది. అతను తన స్వార్థాన్ని మనసులో ఉంచుకొని, తనను తృప్తి దీరా అనుభవిద్దామనే

ఉద్దేశంతోనే యీ పన్నాగం పన్నాడు. ఐతే ఇందులో తనక్కూడా మేలు ఇమిడి ఉన్నది. దేవుడల్లేవొచ్చి వరం ఇవ్వటమే గాక, ఆ వరాన్ని అమలు జరిపేందుక్కూడా పూనుకున్నాడు. ఇలా కలిసిరావటం ఒక విధంగా తన అదృష్టమే ననిపించిందామెకు.

మరే ఇతర పరిస్థితుల్లోనూ రహీమ్‌లాటి అల్పులు తన వైపు తీక్షణంగా చూడటాన్ని కూడా చంచల భరించలేదు. కాని దుర్భర పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ అల్పుల్ని కూడా ఆశ్రయించ వలసిన దుస్థితి వాటిల్లక తప్పటం లేదు. ముఖ్యంగా చంద్రారెడ్డి మీద తాను కసి తీర్చుకోవాలంటే ఇదేమార్గం. అతన్ని జైలుకు పంపాలి; యీ అంచనా తప్పేందుకు వీల్లేదు; తాను వంచింపబడినా మరేం ఫర్వాలేదు. తను పొందే గాయం కన్నా చంద్రారెడ్డికి లభించే శిక్ష అత్యధికమైతే చాలు!

ఆమె ఎక్కువ ఆలోచించకుండానే సిగ్గుపడుతూన్నట్లు నటిస్తూ "ఇక్కడెట్లా?" అన్నది.

అల్లా కరుణించి అన్ని వరాలూ ఒకేసారి ప్రసాదించిన విధంగా తోచింది రహీమ్‌కు. వీరారెడ్డి వొచ్చినప్పటినుంచీ యీ ఉద్యోగం బొత్తిగా గిట్టుబాటవటం లేదు. ఇప్పుడు ఆర్థికరూపంలో కాకున్నా, వస్తురూపంలోనన్నా అపురూపమైనది లభించింది. తన్నుకు గారెల బుట్టలో పడినట్లనిపించింది రహీమ్‌కు.

"ఇలాటి స్థలంలోనే బలాత్కార నేరాన్ని బలపరిచే చిహ్నాలు అనేకం సృష్టించ వొచ్చు–"

ఆ తరువాత రహీమ్ ముందు వెనుకలు ఆలోచించకుండా ఆకలికొన్న పులి లేడిపిల్లమీదికి దూకిన విధంగా చంచలను వొడిసి పట్టుకున్నాడు. ఈ జన్మలో మరోసారి ఇలాటి ఛాన్సు దొరకదు. ఇష్టపడి 'రేప్' చేయించుకునే రమణి ఎలా లభ్యమౌతుంది?

ఆ రేగడి గడ్డల మీదికి చంచలను దొర్లించాడు. అవి గుచ్చుకుంటునప్పటికీ ఆమె ఓర్చుకుంది. రహీమ్ పిల్లి గడ్డం ఎక్స్‌ట్రా హార్డ్ టూత్ బ్రష్‌వలె మృదువైన ముఖాన్ని గుచ్చుతూన్నప్పటికీ ఎలాగో భరించింది. తన ఇష్టానుసారంగా ఎంత మోటుగా, ఘాటుగా రహీమ్ ప్రవర్తిస్తున్నా ఆమె కిమ్మనలేదు.

ఒక స్థితిలో "బాధగా ఉన్నది!" అని మాత్రం సణిగింది చంచల.

"ఓర్చుకో... రేపింగ్ బాధగానే ఉండాలి మరి!"

తానిప్పుడు భరించే యీ బాధకు కొన్ని వందలరెట్ల బాధను రేపు చంద్రారెడ్డి అనుభవిస్తూంటే తన కడుపుమంట చల్లారుతుందనే ఊహ ఇచ్చే ఆనందానికి ఆమె లొంగిపోయింది.

రహీమ్ మోటుతనానికి మృదువైన ఆమె శరీరం నలిగి నల్లేరు కాడ ఐంది. చంద్రారెడ్డి నిజంగానే తనను మానభంగం చేసి ఉంటే (?) ఇప్పుడు తాను పొందిన

గాయాలలో ఏ పదోవంతో లభించి ఉండేవి. నిజానికి అది ఒక అపూర్వానుభవంగానే ఉండేది; అది చేయిజారిపోయిందనేగా చంద్రారెడ్డి మీద గుర్రు! యీవిధంగా చంద్రారెడ్డి నేరం పదింతలవుతుంది కదా ననే తృప్తి కలిగిం దామెకు. ఎంతో పనితనంలో ఎంతో అందంగా తయారుచేసిన బంగారు ఆభరణానికి మెరుగుకాగితం మొరటుగా రుద్ది మెరుగుపెట్టినట్లయింది ఆమె స్థితి.

ఈ కర్మకాండ పూర్తవగానే రహీమ్‌ను అనుసరిస్తూ సమితి ఆస్పత్రికి జేరిందామె. అప్పటికే లేడీ డాక్టర్ వొచ్చి వుండటం తన అదృష్టాల జాబితాకు మరో అంకెను కలిపిందని అనుకున్నది చంచల.

వెంటనే చంచలను పరీక్షించి రిపోర్ట్ రాసి కవర్లో పెట్టి, కవరు అంటించి, రహీమ్ చేతికిచ్చింది లేడీ డాక్టర్.

ఉభయులూ పరమానందంతో పోలీస్ స్టేషన్‌వైపు నడవసాగారు.

డ్రిల్ ఐపోయి రహీమ్ రాకకోసమే వేచి ఉన్నాడు వీరారెడ్డి. ఈ ఫిర్యాదు వొచ్చినప్పటినుంచీ అతని మనస్సు గందరగోళంగా ఉన్నది. ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే విషయమే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఏడున్నరకు రహీం వొచ్చి సెల్యూట్ చేసి కవరు అందించాడు. చంచల మూలనున్న స్టూలు మీద కూర్చొని చంద్రారెడ్డిని అరెస్టు చేసి తీసుకొచ్చి లోపల వేసేదాకా అక్కడే ఉండాలని నిశ్చయించుకున్నది.

వీరారెడ్డి ఆ రిపోర్ట్‌ను జాగర్తగా పరిశీలించాడు. రైటర్‌ని కేకవేశాడు. చంద్రారెడ్డి అరెస్టుకు సన్నాహాలు జరుగుతూన్నవని చంచలకు ఎంతో ఆనందంగా ఉన్నది.

వీరారెడ్డి వేలుపెట్టి చంచలనూ, రహీమ్‌నూ చూపుతూ "వీళ్ళిద్దర్నీ అరెస్టు చేస్తున్నాను. లోపలికి తోసెయ్!" ఆజ్ఞాపించాడు.

చంచలా, రహీమ్‌లు ఆశ్చర్యం నుంచి కోలుకునేప్పటికి ఇనుప కటకటాల వెనుక ఉన్నారు. వీర్యభేతాళుడు యీ కథ చెప్పి ఇలా అన్నాడు:

"రాజా! వీరారెడ్డి– చంచలా రహీమ్‌లను ఎందుకు అరెస్టు చేశాడు? వాళ్ళ నేరాలేమిటో అతను రుజూ చేయవలసి ఉంటుంది కదా! చంద్రారెడ్డిని రక్షించాలనే ఉద్దేశ్యంతోనే ఆ పని చేశాడా? చంద్రారెడ్డిలాటి స్నేహితుణ్ణి చూస్తూ చూస్తూ చేజేతులా అరెస్టు చెయ్యలేకపొయ్యాడా? స్నేహధర్మం ఉద్యోగ ధర్మాన్ని అధిగమించిందా? స్వకులాభిమానమా? సహాధ్యాయి అనే ఆపేక్షా? తాను ఎంత ప్రయత్నించినా ఐశ్వర్యవంతుడూ, రాజకీయంగా ఎంతో పలుకుబడిగల చంద్రారెడ్డి ఎలాగైనా దూసుకోగలడనే ఉద్దేశ్యమా? అంత గొప్పవాడి జోలికి పోవటం తనకు క్షేమకరం కాదనుకున్నాడా? ఈ నా సందేహాలకు సమాధానాలు తెలిసి కూడా చెప్పకపొయ్యావో నీ తలకాయ వేయి ముక్కలవుతుంది!"

విక్రమార్కుని జవాబిది:

"వీరారెడ్డి ఒక్క న్యాయానికి తప్ప మరి దేనికీ కట్టుబడడు. ఏ రాజకీయ, ఆర్థిక పలుకుబడులూ అతనిమీద ప్రయోగించబడి నిష్ప్రయోజనం! నిజంగానే చంద్రారెడ్డి నేరం చేసి ఉంటే, అతన్ని అరెస్టు చేసేందుకు ముందు వెనుకలు ఆలోచించే తత్వం కాదతనిది. ఉద్యోగ ధర్మం ముందు స్నేహ ధర్మం అత్యల్పమైనదని అతనికి బాగా తెలుసు.

పోతే- చంచలా, రహీమ్‌లను అరెస్టు చేయించాడంటే ఆ నేరాలను నిస్సందేహంగా తాను రుజూ చేయగలననే నమ్మకం అతనికి కలిగి ఉండాలి.

లేడీ డాక్టర్ రాసిన రిపోర్టులోనే యీ రహస్యం భేదించబడింది. ఆమె 'చంచల మీద రేప్ జరిగిం'దని దృఢపరిచింది. అప్పటికి అరగంట ముందే ఆ అత్యాచారం జరిగిందని కూడా ఆమె రిపోర్ట్‌లో పేర్కొన్నది.

అరగంట క్రితం జరిగిన బలాత్కారం- రహీమ్‌గాడి వల్లనే జరిగి ఉండాలి. ప్రజారక్షణకు నియోగించబడిన వాడు తన విధిని విస్మరించటమే గాక. నారీ భక్షణ క్కూడా తలపడ్డాడు. రేప్ చేసిన నేరానికిగాను రహీమ్‌ను అరెస్ట్ చేయవలసి వొచ్చింది.

చంచల రిపోర్ట్‌లో పేర్కొన్నట్లు మూడు గంటల ముందు యీ రేప్ జరగలేదు. అసలప్పటికి మానభంగమే అవలేదు.

మానభంగం ఐనదన్న ఫిర్యాదుకు బలమైన సాక్ష్యాన్ని సాధించేందుకు ఆస్పత్రికి పరీక్షకోసం వెళ్ళేముందే మానభంగం కావాలనే ఆమె చేయించుకొని ఉండాలి. యీ విధంగా తప్పుడు ఫిర్యాదు చేసినందుకు చంచల అరెస్టు చేయబడింది. ఈ రెండు నేరాలనూ వీరారెడ్డి రుజూ చేయగలడు. మెడికల్ రిపోర్డ్‌లో పేర్కొన్న సమయసూచనే యీ సమస్యకు బలవత్తరమైన పరిష్కార మార్గాన్ని సూచించింది."

ఈ జవాబుతో విక్రమార్కునికి మౌనభంగం కాగా, వీర్య భేతాళుడు తుర్రున ఎగిరి మర్రిచెట్టెక్కాడు.

*- డిసెంబర్, 1967*